ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023 5
పార్వతీపురం మన్యం



31న జాబ్ మేళా

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాధాకృష్ణ తెలిపారు. హెటిరో డ్రగ్స్, రెడాక్స్ లేబొరేటరీస్, ఎస్బిఐ కార్డ్స్ వంటి కంపెనీల్లో ఉద్యోగాల కోసం మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం పది గంటలకు అభ్యర్థులు నిర్దేశిత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. బిఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బిటెక్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలకు సంబంధించిన జెరాక్స్ కాపీలతోపాటు ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత నిరుద్యోగ యువకులు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9440537105ని సంప్రదించాలని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో కోరారు.

కళ్లాల్లో ధాన్యం... కళ్లలో దైన్యం

- సేకరణ నిలిపివేతతో ఎక్కడి పంట అక్కడే
- అప్పుల ఊబిలో అన్నదాత
- ఏనుగుల బెడదతో ఆందోళన
- త్వరలో కొంటామంటున్న అధికారులు



కన్నపుదొరవలసలో కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో రైతులు నిరాశంగా ఉన్నారు. తమ ధాన్యం ఎప్పుడు మిల్లులకు చేరతాయోనని ఎదురుచూస్తున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన పంట అమ్ముడుపోక రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈనెల 8 నుంచి ప్రభుత్వం ధాన్యం సేకరణ నిలిపివేయడంతో కల్లాల్లో ధాన్యం ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయి. సంక్రాంతి ముందే ధాన్యం మిల్లుకు చేరాల్సి ఉండగా ప్రభుత్వ విధానం ఫలితంగా కల్లాలోనే ఉన్నాయి.

ఖరీఫ్ ధాన్యం సేకరించాల్సి ఉండగా మధ్యలోనే సేకరణ నిలిపివేయడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. పెట్టుబడులకు చేసిన అప్పుకు వడ్డీలు ఒకవైపు పెరిగిపోతుండగా, మరోవైపున చేసి అప్పులు చెల్లించాలంటూ అన్నదాతలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో రైతులు



కొమరాడ : కళ్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలనుచూపుతున్న నాయకులు

ఆవేదన చెందుతూ దీనంగా ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అలాగే మండలంలో ఏనుగులు సంచారం కూడా ఉంది. ఏనుగులు ఎప్పుడు వచ్చి తమ ధాన్యాన్ని పాడుచేస్తాయేమోనన్న ఆందోళన రైతాంగం ఉంది. కల్లాల్లోనే ధాన్యం బస్తాలతో నింపి ఉంచి కాపలా కాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడక్కడ దొంగతనాలు జరగడంతో వాటిని వింటున్నటువంటి రైతులు తమ ధాన్యం కూడా దొంగతనం జరిగే అవకాశాలు లేకపోలేదని భయాందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఈ ఏడాది వర్షాలు కూడా లేవని, దీంతో కళ్లాల్లో ధాన్యం సురక్షితంగా ఉన్నాయని, వర్షాలు పడితే ధాన్యం తడిచిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో వేలాది ధాన్యం బస్తాలు కల్లాలలోనే ఉండి పోవడం శోచనీయం. ఇ- క్రాప్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రభుత్వం దాన్ని పట్టించుకోకుండా ప్రొక్యూర్ మెంట్ నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. అధికారులు కూడా ధాన్యం సేకరణలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో అన్నదాత దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

గుమ్మలక్ష్మీపురం: గిరిజన రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇటు వ్యవసాయ శాఖ, అటు జిసిసి అధికారులు ముందుకు రావడంలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో 23 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశారు. అయితే నేటి వరకు 50శాతం కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి ఉంది. పెదఖర్జ, ఇరిడి, తోలుఖర్జ తదితర గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం ఇంటి వద్దే నేటికీ దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి ధాన్యం నిల్వతో ఎలుకుల బెడద, చెదలు పడుతున్నాయని రైతులు ఆందోళన చెంచుతున్నారు. ధాన్యం కొనుగోలుకు వ్యవసాయ శాఖ అధికారులు గోనెసంచెలు ఇచ్చి రెండు నెలలు దాటిన కొనుగోలు చేపట్టలేదని గిరిజన రైతులు పల్లెరిక బారికి, బిడ్డిక బలరాం తెలిపారు.



విక్రమపురం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మా ధాన్యం కొనేదెప్పుడు?

విక్రమపురం అన్నదాతలు ఆందోళన

వీరఘట్టం : మా ధాన్యం కోనేదెప్పుడని మండలంలోని విక్రమపురానికి చెందిన రైతులు శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పంట బాగా పండిందని సంతోషపడాలో, కొనుగోలు లేదని బాధపడాలో తెలియని పరిస్థితుల్లో అన్నదాతలు సతమతమవుతున్నారు. గ్రామంలోని సుమారు 60 మంది రైతులకు చెందిన 3వేల ధాన్యం బస్తాలు పండగ ముందు నుంచి కొనుగోలు చేయకపోవడంతో కళ్లాలోని దర్శనమిస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

కొమరాడ : రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడలో రైతులు తమకళ్లాల్లో నిల్వచేసిన ధాన్యం బస్తాలను ఆయనతో పాటు రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కళ్లాలోనే దర్శమిస్తున్నాయన్నారు. ఆర్‌బికె, వ్యవసాయ సిబ్బంది రైతుల వద్ద మిగులు ధాన్యం ఫోటోలు తీసుకొని నెట్‌లో అప్లోడ్ చేసుకునే పరిస్థితి కనిపిస్తుంది తప్ప ఎప్పుడు కొంటారో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కళ్లాల్లో ధాన్యంతో అవస్థలు

ధాన్యం ఉండిపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. సంక్రాంతి ముందు నుంచి ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. నా పొలంలో పండిన 300 బస్తాల ధాన్యం కళ్లాంలోనే ఉన్నాయి. ఆర్‌బికెల చుట్టూ తిరగడమే తప్ప ధాన్యం మాత్రం మిల్లులకు చేరలేదు. మరోవైపున ఏనుగులు ఎప్పుడు వచ్చి ఏం చేస్తాయోనన్న భయం. మా ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మా గ్రామంలో వందలాది బస్తాలు కల్లాల్లోనే ఉండిపోయాయి. అధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేదు. ధాన్యం మిల్లులకు చేరక నరకయాతన పడుతున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి ధాన్యం మిల్లుకు చేరేలా చర్యలు చేపట్టాలి.

ద్వారపు రెడ్డి సోములు,
రైతు, జియమ్మవలస

సేకరణ నిలిపివేతతో ఇబ్బందులు

ప్రభుత్వం ఈనెల 8నుంచి ధాన్యం సేకరణ నిలిపివేయడంతో కళ్లాలోనే 377 ధాన్యం ధాన్యం బస్తాలు ఉండిపోయాయి. ఇ-క్రాప్ నమోదు చేసినా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. దీంతో నానా అవస్థలు పడాల్సి వస్తుంది. వేలాది రూపాయలు పెట్టి పండించిన పంటను అమ్ముకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితులు నెలకొన్నాయి.

-లంక విశ్వనాథం,
రైతు, పెదమేరంగి

ధాన్యం కొనాలి

గిరిజన రైతులు కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ధాన్యం పంట దిగుబడి బాగా వచ్చిందని, అయితే ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలి.

కోలక అవినాష్,
ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు

త్వరలో కొత్త వెబ్‌సైట్ ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రస్తుతం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియ వెబ్ సైట్ ను ప్రభుత్వం నిలిపివేసింది. త్వరలోనే మరో కొత్త వెబ్ సైట్ ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మహేంద్ర కుమార్,
జిసిసి డిఎం, పార్వతీపురం డివిజన్

ధాన్యం సేకరణకు అనుమతులొస్తాయి

మండలంలో రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని సేకరించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులొస్తాయి. మండలంలోని 8వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయినట్లు యాప్‌లో అప్లోడ్ చేశాం. మండల పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యానికి మరో రెండు, మూడు రోజుల్లో అనుమతులు రావచ్చు.

- కె.హర్షలత,
మండల వ్యవసాయాధికారి, జియ్యమ్మవలస



సమావేశంలో మాట్లాడుతున్న సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నాగరాణి; పక్కన ఐటిడిఎ పిఒ నవ్య

పాలిటెక్నిక్ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచాలి

సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ సి.నాగరాణి అన్నారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పరిధిలో గల అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని, వాటిని వినియోగించుకోవాలని అన్నారు. గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష ఫీజు రూ.400 నుంచి రూ.100 కి తగ్గించామని అన్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎన్నో రకాల కోర్సులు ఉన్నాయని, వాటిపై విద్యార్థులకు అవగాహన కలిగేలా హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలని సూచించారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయకుండా ప్రవేశాలు పొందిన వారికి కూడా ఫీజు రీయింబర్స్ మెంట్ వర్తించేలా చర్యలు తీసుకొన్నామని అన్నారు. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని, వాటిని కూడా వినియోగించుకోవాలని అన్నారు. సీతంపేట పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని, ప్రవేశాల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ హాస్టల్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకొంటామన్నారు. ఐటిడిఎ పిఒ బి.నవ్య మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో గల అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పిస్తామన్నారు. పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష కోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇప్పిస్తామని అన్నారు. అలాగే గిరిజన విద్యార్థుల ప్రవేశ పరీక్ష ఫీజును కూడా ఐటిడిఎ చెల్లిస్తుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు గిరిజన విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలను డైరెక్టర్ నాగరాణి పరిశీలించారు. కళాశాలలో మెకానికల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కాలేజీలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని డైరెక్టర్ అన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరగా, స్పందించిన ఐటిడిఎ పిఒ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను పంపించి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. సమావేశంలో పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపల్ నాగభూషణరావు, ఎడ్యుకేషన్ ఒఎస్‌డి యుగంధర్, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ, జిసిడిఒ, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు తిరుపతి రాజు, సూర్యకుమారి, విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు ఉమావాణి, శారద నారాయుడు, ఆరిక భాస్కరరావు కొండ గొర్రె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

అర్హతే ప్రామాణికంగా పథకాలు : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్




అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మండలంలోని డికె పట్నం సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. సిబ్బంది సమయపాలనను పాటించాలని సూచించారు. గ్రామ సచివాలయ పరిధిలోని పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం గోడపై జగనన్న తోడు, అమ్మ ఒడి, జగనన్న కానుక తదితర పథకాల లబ్ధిదారుల వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, ఇ-క్రాప్ నమోదు, తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గ్రామాల్లోని పౌష్టికాహార లోపం, బరువు తక్కువ ఉన్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకుని, అటువంటి వారి వివరాలు అంగన్వాడితో పాటు, సచివాలయంలో కూడా జాబితాను పొందుపర్చాలన్నారు. రక్తహీనత గల గర్భిణులకు పౌష్టికాహారం, మందులు అందించాలని తెలిపారు. రక్తహీనతపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బగాది జగన్నాథరావు, ఎంపిడిఒ జావేద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ నెల 30, 31 తేదీల్లో జరుగు బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గల పలు బ్యాంకుల్లో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు 2022 నవంబర్ నుంచి రావాల్సిన వేతన సవరణ, ఐదు రోజుల బ్యాంకింగ్, ఖాళీల భర్తీ, పెన్షన్ అప్డేషన్, సిపిఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కారం కోసం రెండు రోజుల పాటు బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం విధానాల వల్ల ఉద్యోగుల జీవనం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయకుండా ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఫిక్స్‌డ్ టెర్మ్ ఎంప్లాయిమెంట్ విధానాన్ని ప్రవేశపెట్టి భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని, కావున ఇందుకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రజలను విభజించి పాలించే మోడీ ప్రభుత్వ విధానాల పట్ల బ్యాంకు ఉద్యోగులు అప్రమత్తంగా మెలగాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే తప్ప మరొకటి కాదని, వీరి పోరాటానికి సంపూర్ణం మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం : బ్యాంకు ఉద్యోగులకు సమ్మె కరపత్రాలను అందజేస్తున్న సిఐటియు నాయకులు

పాలకొండ రూరల్: ఈనెల 30, 31 బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు తెలుపుతూ కరపత్రాలు పంపిణీ కార్యక్రమం పట్టణంలోని అన్ని బ్యాంకుల్లో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాదా రాము మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని, దీన్ని వ్యతిరేకించకపోతే అన్ని రకాల భద్రతను ఉద్యోగులు ప్రజలు కోల్పోతారని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాల్ని తిప్పికొట్టాలని, కార్మిక హక్కుల హరించే లేబర్ కోడ్ లను వ్యతిరేకించాలని, ప్రజలను విభజించి పాలించి మోడీ ప్రభుత్వ విధానాలు పట్ల అప్రమత్తంగా మెలగాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షణకు ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.



నేత్ర శస్త్రచికిత్సకు వెళ్తున్న వృద్ధులతో వైద్యాధికారులు

నేత్ర శస్త్రచికిత్సకు వృద్ధుల ఎంపిక

కురుపాం : కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో ఇంత వరకూ నిర్వహించిన వైఎస్ఆర్ అవ్వా,తాత కంటి వెలుగు నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) ఉన్న 35మందికి శుక్రవారం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్యులు శోభారాణి, కంటి వైద్య సహాయకులు రోజా, మాలిక, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

- రైతు సంఘాల డిమాండ్
- ట్రాక్టర్లతో అన్నదాతల ర్యాలీ

ప్రజాశక్తి -కలెక్టరేట్

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పుతూ మోడీ చేసిన చట్టాలు రైతు సంఘాల పోరాటంతో వెనక్కు తీసుకున్నప్పటికీ ఢిల్లీ పోరాటంలో ప్రధాని ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లతో ర్యాలీలు చేయాలని ఎస్‌కెఎం (సంయుక్త కిసాన్ మోర్చా) పిలుపు మేరకు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్ నుంచి మెయిన్ రోడ్డు మీదగా బెలగాంలోని స్థానిక సిఐటియు కార్యాలయం వరకూ ట్రాక్టర్లతో రైతులు ర్యాలీ చేశారు. రైతు సంఘం బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈసభలో నాయకులు మాట్లాడుతూ మోడీ తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను రైతాంగం పోరాడి వెనక్కి తిప్పి కొట్టినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ దొడ్డిదారిన వ్యవసాయ చట్టాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కావున అన్ని పంటలకు మద్దతు ధరలు ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం ఇస్తామని అంగీకరించినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. పంటలకు మద్దతు ధరలు లేకుండా చేసి, వ్యవసాయానికి పెట్టుబడులు విపరీతంగా పెరిగేలా అన్ని ధరలు పెంచి అనివార్యంగా రైతులే వ్యవసాయాన్ని వదులుకునేలా మోడీ చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగమే ఈరోజు ధాన్యం కొనుగోలు చేయకపోవడం, ఇతర పంటలకు మద్దతు ధర ఇవ్వకపోవడమని అన్నారు. ఇప్పటికైనా రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల పంట రుణాలు రద్దు చేయాలని, విద్యుత్తు మీటర్లు వ్యవసాయ బోర్లకు పెట్టకూడదని, సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధర, రైతాంగ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడాలని రైతాంగాన్ని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రవీంద్ర, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు శ్రీనునాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బొత్స నరసింహారావు, పి.రమణి, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు పైడా భాస్కరరావు, రైతు సంఘం నాయకులు ఈదుబిల్లి వెంకటనాయుడు , గ్రామీణ రైతు వ్యవసాయ కార్మిక సంఘం సంఘం నాయకులు సంగం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా నాయకులు రెడ్డి వేణు, ఎఐఎఫ్‌టియు నాయకులు, అన్ని రైతు సంఘాల నాయకులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



పట్టణంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు

రేషన్‌కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డుదారులకు ఫిబ్రవరి నుంచి గోధుమ పిండి పంపిణీ చేయాలని సూచించిందని తెలిపారు. జిల్లాలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాల్టీల్లో కార్డుదారులకు నెలకు రెండు కిలోల గోధుమ పిండిని కిలో రూ.16 చొప్పున అందించాలని పేర్కొన్నారు. పిడిఎస్ కార్డుదారులకు రేషన్ వాహనం ద్వారా కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని వినియోగదారుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

పార్వతీపురం రూరల్ : పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని ఎంఆర్ నగరంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే చెత్తను ఇంటి ఆవాసాల్లో పారవేయకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని డిఐఒ జగన్మోహన్ వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం జె.పోలమ్మ, సచివాలయం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దారి లేకుండా చేస్తున్నారు

వీరఘట్టం : తమ పొలాలకు వెళ్లేందుకు వీల్లేకుండా కొంతమంది వ్యాపారులు దారి చుట్టూ కంచెలు కూడా ఏర్పాటు చేస్తున్నారని వీరఘట్టంకు చెందిన పలువురు రైతులు శుక్రవారం తహశీల్దార్ చందక సత్యనారాయణకు ఫిర్యాదుచేశారు. మండల కేంద్రంలోని భారత గ్యాస్ గోడౌన్ ఎదురుగా తమ పంట పొలాలున్నాయని, నలుగురికి ఉపయోగపడే దారిలో కంచెలు వేసి మూసివేయడంతో పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తక్షణమే పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఐ ప్రసాదరావు

సురక్షిత ప్రయాణానికి రహదారి భద్రత ప్రధానం

సాలూరు : ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి రహదారి భద్రత ప్రధానమని ఎంవిఐ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మన కుటుంబ విషయాలు, ఇతర అంశాలపై ఆలోచన చేయరాదన్నారు. కార్యక్రమంలో డిఎం భాస్కరరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎంఎస్ నారాయణ, డిప్యూటీ ట్రాఫిక్ సూపరింటెండెంట్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జమునకు నివాళి

సాలూరు : సీనియర్ నటీమణి జమున మృతికి సంతాపసూచకంగా శుక్రవారం స్థానిక శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు నివాళు లర్పించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నటీమణి జమున అనేక సాంఘిక, పౌరాణిక సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారని చెప్పారు. అలనాటి కథానాయికల్లో మేటి నటీమణి అని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శిరీష

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సీతానగరం : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి కె.శిరీష అన్నారు. మండలంలోని జోగింపేట బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ప్రతిరోజూ ఉతికిన బట్టలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడే వారి నమోనాలు తీశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈశ్వరరావు, వైద్య సిబ్బంది సింహాచలం, చైతన్య, హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

వీరఘట్టం : మండలం పరిధిలోని పివిఆర్ పురంలో గల నాగావళి నదీ తీరం నుంచి శుక్రవారం ట్రాక్టర్‌తో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ట్రాక్టరును పట్టుకున్నారు. ఇసుకతో పట్టుబడిన ట్రాక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయాన్నికి అప్పగించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ఎపిఅంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎ.నారాయణమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఐసిడిఎస్ రూరల్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుకూలంగా అంగన్వాడీలకు వేతనాలు చెల్లించాలని, జీవో 1ను రద్దు చేయాలని, హెల్పర్ ప్రమోషన్‌కు వయసు నిబంధన 50 ఏళ్ళ కల్పించాలని, కార్యకర్తతో సమానంగా హెల్పర్లకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి 300 మంది జనాభాకు ఒక నట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగే పింఛన్లు ఇప్పించాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఒ సుగుణకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పార్వతి, పుష్ప, తిరుపతమ్మ, సుగుణ, రమణమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



సాలూరు రూరల్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నా

పాలకొండ: అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని, వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, జీవో 1ను రద్దు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఒ గీతకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శి బి.అమరవేణి, జి.జెస్సీబాయ్, నాయకులు జి. శారద, ఎం.శ్యామల, కె.శారదా, రజిని, శ్రీదేవి, మణికుమారి, గంగమ్మ ధనలక్ష్మి, అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పాలకొండ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మురుగు కాలువలకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీలో మురుగు కాలువల నిర్మాణాలకు మోక్షమెప్పుడు కలుగుతుందని జనసేన నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడును కలిసిన ఆ పార్టీ జిల్లా నాయకులు వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీశంకర్ తదితరులు మున్సిపాలిటీని వేధిస్తున్న సమస్యలపై చర్చించారు. సౌందర్య జంక్షన్లో ప్రమాదకరంగా ఉన్న కాలువపై పలకలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే టౌన్ పోలీస్ స్టేషన్ వీధిలో మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే కొత్తవీధి నుంచి జగన్నాధపురం వెళ్లే దారిలో ఉన్న వెంకటేశ్వర కాలనీకి రాకపోకలు సాగించే రహదారిలో కాలువపై ఉన్న సిమెంట్ పలకలు శిథిలమై రాకపోకులకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు తెలిపారన్నారు. తక్షణమే మున్సిపాలిటీలోని మురుగు కాలువలు నిర్మాణాలు చేపట్టాలన్నారు. రోజూ తాగునీరు ఇవ్వాలని, మెయిన్‌రోడ్‌లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని, మున్సిపాలిటీని వేధిస్తున్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు వినతిని అందజేశారు. కమిషనర్ స్పందిస్తూ వాటిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి డిపోలో 34వ భద్రత వారోత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు నివారించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, అలాగే పాదచారులను గమనించాలని, నిర్ణీతమైన, నిర్దిష్టమైనటువంటి ప్రదేశాల్లో స్పీడ్ కంట్రోల్ చేసుకుని ప్రాణాలను కాపాడాలని తగు సూచనలు చేశారు. డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీలో జరుగుతున్న ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు, అలాగే పాలకొండ డిపోలో గత 2022లో జరిగిన ప్రమాదాలకు సంబంధించి వివరాలను తెలియజేస్తూ డ్రైవర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సిస్టు లక్ష్మణరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ ఎం.కే.ఎం రాజు, స్టోర్స్ సూపర్వైజర్ పి.మధుబాబు, సెక్యూరిటీ ఇన్చార్జి బి. రాంబాబు, డ్రైవర్ ఇన్స్పెక్టర్ సాకేటి నాగరాజు, సిస్టం సూపర్వైజర్ పివి ఆచారి, యూనియన్ నాయకులు బి.కె. మూర్తి, పాలకొండ డిపోలో ఉన్న అన్ని యూనియన్ అసోసియేషన్ల, గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ లు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పేరుతో కుప్పం నుంచి చేపడుతున్న పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. యువత భవిష్యత్తు కోసం 400 రోజులు నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని, అందుకోసం యువత, నిరుద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో మద్దతు తెలపాలని కోరారు.

సీతంపేట : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర విజయవంతం జరగాలని టిడిపి నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు నాలుగు వేల కిలోమీటర్ల దూరం చేపడుతున్న పాదయాత్ర సజావుగా సాగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు ఎస్.మాలయ్య, ఆరిక లచ్చుమయ్య, సవర కుంపి, మాజీ సర్పంచులు కె.విశ్వనాథం, సవర సూర్యారావు, సవర గంగయ్య, యూత్ లీడర్లు ఎస్.మోహన్ పాల్, ఊయక అప్పారావు, ఎస్.కూర్మారావు, మల్లేష్, సీనియర్ నాయకులు బిడ్డిక రాము తదితరులు పాల్గొన్నారు.



కుప్పం వెళ్లి ఉమ్మడి జిల్లాల టిడిపి నాయకులు

కోట దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

వీరఘట్టం : మండల కేంద్రంలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నారా లోకేష్ చేపట్టిన యువగలము పాదయాత్ర విజయ వంతం కావాలని కోట దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాదయాత్రకు తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచర్ల అనిల్ బాబు, ఆర్ వి రమణ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చిన వారి పేర్లు మాస్టర్ రోల్లో పరిశీలించి ఉపాధి పని చేస్తున్న వారికి ప్రభుత్వ నిబంధన ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు పూటలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.నాగలక్ష్మి, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లు నూరు శాతం చేయాలన్నారు. జగనన్న సంకల్పం, జగనన్న కాలనీల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. గృహాల లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. అన్ని రికార్డులు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు పూర్తి చేయాలన్నారు. సమాచార హక్కు చట్టంపై వస్తున్న దరఖాస్తులకు సమాధానమివ్వాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేశ్‌రెడ్డి

ఇంకెన్నాళ్లీ అవస్థలు?

గతుకుల రోడ్డుతో ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కలింగ శ్రీకాకుళం పార్వతీపురం (సిఎస్‌పి) రహదారి నుండి చిదిమి గ్రామం వరకు రహదారి గోతులతో ఉండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అభివృద్ధి చెందకపోవడంతో ఇంకెన్నాళ్లుఈ అవస్థలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ. 97 లక్షలతో సిఎస్‌పి రహదారి నుండి చిదిమి గ్రామం వరకు బీటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో రహదారి మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో రహదారి మరింత గోతులమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు అటు వాహనదారులు ఇటు పాదచారులు తీవ్ర అవస్థలకు గురికావాల్సి వస్తుంది. ఇదే గ్రామంలో 2010లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య రచ్చబండ రెండో విడత కార్యక్రమానికి హాజరై బీటి రహదారి సౌకర్యం ఉన్నందున బస్సు సౌకర్యం కల్పించారు. రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో ఆర్‌టిసి అధికారులు బస్సు సర్వీసును రద్దు చేశారు. ఈ కారణంగా గర్భిణులు, రోగులు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలకు గురవుతున్నట్లు తెలిస్తోంది. ప్రస్తుతం ఈ రహదారి అధ్వానంగా ఉండటం వల్ల చిధిమి గ్రామస్తులు, యు. వెంకంపేట గ్రామం సిఎస్‌పి రహదారికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పివిఆర్ పురం గ్రామస్తులు చిదిమి గ్రామం వైపు రాకుండా తూడి, ఆడారు గ్రామం వైపు వెళ్లి రాకపోకలు సాగించవలసి పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తుల ఆందోళన చెందుతున్నారు. రహదారి గోతులు మయంగా ఉండటం వల్ల వాహనాలు తరచుగా మరమ్మతులు గురవుతున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకుల, అధికారులు స్పందించి బిటి రహదారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులమయమైన సిఎస్‌పి రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంఒ మోహనరాయుడు

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రికార్డులన్నింటినీ సక్రమంగా నిర్వహించాలని ఐటిడిఎ అసిస్టెంట్ మోనిటరింగ్ అధికారి పిసిహెచ్ మోహనరాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన దొరజమ్ము, రేగిడి, దుడ్డుకళ్ళు, దివిటీ గూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ఫేషియల్ యాప్‌ను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల అటెండెన్స్‌ను యాప్‌లో నమోదు చేసి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఫోటోలను అప్లోడ్ చేయాలని తెలిపారు. అలాగే పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు ఉపయోగిస్తున్న స్నానపు గదులను, మరుగుదొడ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇటీవల కాలంలో విద్యాశాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు ప్రతి పాఠశాలను ఆకస్మికంగా పరిశీలిస్తారని, కావున రికార్డులను తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. అలాగే విద్యాశాఖ అందించిన వర్క్ బుక్కులను కూడా ఎప్పటికప్పుడు విద్యార్థులతో నింపి యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. సమ్మేటివ్ అసెస్మెంట్, ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్ష పేపర్లను దిద్ది మార్కులను యాప్లో నమోదు చేయాలని తెలిపారు.

అంచనాలు తారుమారు!

- ఇంకా 40శాతం ధాన్యం రైతుల వద్దే..
- లక్ష్యం కోసం జియోట్యాగింగ్
- కొనుగోలు కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - జామి

ధాన్యం కొనుగోలులో అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. కొనుగోలులో అధికారుల లెక్కలు పూర్తిగా తప్పాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొన్నామన్నది పక్కన పెడితే, రైతుల వద్ద ఇంకా మే మేరకు ధాన్యం ఉన్నాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో గత కొద్ది రోజులుగా కొనుగోలు నిలిపివేసి, లెక్కలతో అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఈ అయోమయంలో జిల్లాలో రైతుల వద్ద ధాన్యం నిల్వలపై జియోట్యాగింగ్ మెదలు పెట్టారు. మంగళవారంతో ఆ ప్రక్రియ పూర్తి కావచ్చింది. అయితే ఇప్పటికైనా కొనుగోలు ప్రారంభమవుతాయా..? అంటే ఎటూ తెల్చలేని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే పంటను నూర్చి రాసుల్లో కొంత మంది, కుప్పలు వేసుకుని మరికొంత మంది రైతులు కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్‌బికెలు, మిల్లర్ల చూట్టూ తిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యం తీసుకుని, ఖరీఫ్ ఆఖరినాటికి మరో లక్ష వరకు కొనుగోలు చేసేవారు. కానీ ఈ ఏడాది పంట బాగా పండిందని అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షలు టన్నులు పంట పండుతుందని అంచనా వేశారు. ఇందులో 10శాతం రైతులు స్వప్రయోజనాలకు వినియోగించగా, మిగిలిన 4.5 లక్షల మెట్రిక్ టన్నుల పంట అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. కానీ కొనుగోలు లక్ష్యం మాత్రం పొంతన లేకుండా కేవలం 2.64లక్షల టన్నులకు పరిమితం చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో రెండు వారాల క్రితమే కొనుగోలు లక్ష్యం పూర్తయ్యింది. కానీ అధికారుల లెక్క తప్పడంతో జిల్లా వ్యాప్తంగా సుమారుగా 40 నుంచి 50 శాతం ధాన్యం రైతుల పొలాలు, కళ్లాల్లోనే ఉండిపోయాయి. పోనీ ఎంత ధాన్యం ఉందో ప్రభుత్వానికి నివేదించడాకి అధికారులు లెక్కలు లోపభూయిష్టంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొనుగోలు నిలిపివేసి, రైతుల వద్ద ఉన్న ధాన్యం అంచనాలకు జియోట్యాగింగ్ చేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. ధాన్యం ఉండిపోయిన రైతులంతా యాప్‌లో నమోదుచేసుకోవాలని, జియో ట్యాగింగ్ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటికైనా కొనుగోలు చేస్తారా? లేదా కల్లబొల్లి మాటలతో రైతులను మభ్యపెడతారా అన్నది వేచిచూడాల్సిందే.

సక్రమంగా పాఠశాలల నిర్వహణ

డిఇఒ లింగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన సక్రమంగా అమలు చేయాలని డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని డిఇఒ అకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభా పాటవాలను నిరంతరం పరిశీలించి, వెనుక బడ్డ వారిని ముందుకు తీసుకువచ్చే బాధ్యత హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల మార్క్‌షీట్లను అకడమిక్ ప్రకారం సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థుల స్థాయి పరిశీలించి ఆయా పరీక్షల్లో మార్కులు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేస్తామని, అందులో తేడాలు కనిపిస్తే చర్యలు తప్పవని డిఇఒ హెచ్చరించారు. ఈ సమావేశంలో సారిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం డి.రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి